క్లుప్తంగా

నేడు పీఏసీఎస్ సమావేశం

మంచాల: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఆవరణలో శుక్రవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మంచాల సహకార సంఘం సీఈఓ చింతకింది శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. పాలకవర్గ సభ్యులతో పాటు మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన పెంటయ్య (59) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. బీఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, రైతు సంఘం నాయకుడు రేణురెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు కోఆర్డినేటర్ శ్రీను, రాజు, రవీందర్, అనంతరాములు, కుమార్‌సేట్, పవన్, అశోక్, ఆంజనేయులు, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి చేయూత..

కడ్తాల్: కడ్తాల్ మండలం పెద్దావేములోనితండా పంచాయతీ పరిధిలోని చిన్నవేములబావితండాకు చెందిన నిరుపేద శారద-కిషన్‌నాయక్ కూతురు వివాహానికి గ్రామ సర్పంచ్ శ్వేత భూనాథ్‌నాయక్ రూ.16,116 ఆర్థిక సాయం అందజేశారు. గురువారం వివాహ వేడుకలో ఆర్థిక సాహాయాన్ని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా పెళ్లికూతురుకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పత్యా, వార్డుమెంబర్ సికిందర్, గోపాల్, వినోద్, లాల్య, ఘాంస్య పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి కృషి: జెడ్పీటీసీ



నిధుల ప్రొసీడింగ్ అందజేస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: తండాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పల్లెచెలకతండాలో సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి రూ.5లక్షల జెడ్పీ నిధులకు సంబంధించిన ప్రొసిడింగ్‌ను గురువారం సర్పంచ్ లోక్యానాయక్‌కు జెడ్పీటీసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో దీప్లానాయక్, అశోక్ నాయక్ ఉన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

యాచారం: బొక్కల కంపెనీని మూసేస్తారా.. లేదా అంటూ కొత్తపల్లి గ్రామస్తులు మండిపడ్డారు. కంపెనీని మూసేయాలని వారు చేస్తున్న దీక్ష గురువారం కూడా కొనసాగింది. దీక్షకు మద్దతుగా తక్కళ్లపల్లి సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ, కొత్తపల్లి ఉప సర్పంచ్ కావలి జగన్ దీక్షలో పాల్గొన్నారు. కంపెనీ మూసేయాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు: ఎంపీడీఓ

మాడ్గుల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అభివృద్ధి పనుల్లో కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని ఎంపీడీఓ రాఘవులు సూచించారు. మండలంలోని అప్పారెడ్డిపల్లి, నాగిళ్ల, ఫిరోజ్‌నగర్ గ్రామాల్లో గురువారం ఎంపీడీఓ పర్యటించారు. ఆయా గ్రామాల్లో పల్లె ప్రకృతివనం, శ్మశానవాటిక, వనసర్సరీలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈజీఎస్ కూలీలతో పనుల గురించి చర్చించారు. ఆయన వెంట ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కార్యదర్శి తిరుపతి, ఈజీఎస్ టీఏ యాదమ్మ ఉన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు పరమేశ్‌కు చేయూత

ఆమనగల్లు: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, ఆమనగల్లు పట్టణానికి చెందిన పరమేశ్ నూతన ఇంటి నిర్మాణానికి ఉప్పల వెంకటేశ్ మిత్రమండలి చేయూతనందించింది. పరమేశ్ ఇంటి నిర్మాణం సందర్భంగా వెంకటేశ్ మిత్ర మండలి ఆధ్వర్యంలో బోర్ డ్రిల్లింగ్ చేయించారు. కాగా బోరును గురువారం వెంకటేశ్ మిత్రమండలి అధ్యక్షుడు షేక్ టిప్పు సుల్తాన్ ప్రారంభించారు. పరమేశ్‌కు అండగా ఉంటామని షేక్ టిప్పుసుల్తాన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప్పల వెంకటేశ్ మిత్రమండలి సభ్యులు రవీందర్, శంకర్, అశోక్, తాహెర్, ఫయాజ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పిస్తాం

సర్పంచ్ అనురాధ

మాడ్గుల: గుడితో సమానంగా ప్రభుత్వ బడులను అభివృద్ధి చేస్తామని కొల్కులపల్లి సర్పంచ్ అనురాధ అన్నారు. మండలంలోని కొల్కులపల్లిలో గురువారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ అనురాధ సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల గురించి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశమై చర్చించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులను కల్పిస్తామని, వారి చదువులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా పాఠశాల అభివృద్ధికి తమవంతు తోడ్పాటును అందిస్తామని సర్పంచ్ అన్నారు.

కల్వర్టు పూర్తయ్యేనా?

- నత్తనడకన బండిరేగుల కల్వర్టు నిర్మాణ పనులు
- గతేడాది జులైలో పనులు ప్రారంభం
- ప్రత్యామ్నాయ మార్గంలో ప్రయాణికుల అవస్థలు



బండిరేగుల వద్ద నిర్మాణ దశలో కల్వర్టు

హయత్‌నగర్: అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వాహనదారులకు శాపంగా మారింది. కల్వర్టు నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతుండటంతో కొహెడ, తొర్రూరు, మునుగనూరు నుంచి వచ్చే ప్రయాణికులు ఆరు నెలలుగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని మునుగనూరు-హయత్‌నగర్ మధ్యన ఉన్న బండిరేగుల వద్ద వరద కాలువ ఉంది. గత మూడేళ్లుగా మాసాబ్‌ట్యాంక్ చెరువు నుంచి వస్తున్న వరదతో బండిరేగుల వద్ద వరదనీరు రోడ్డుపైకి వస్తుంది. దీంతో ఆ రోడ్డు నుంచి హయత్‌నగర్‌కు వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి రోడ్డు మూసివేస్తుండటంతో ప్రయాణికులకు ఆటంకం ఏర్పడుతుంది. దీంతో వరద నీరు రోడ్డుపైకి రాకుండా నివారించేందుకు ఇక్కడ కల్వర్టు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కొంతకాలంగా కోరుతున్నారు. వారి కోరిక మేరకు ఏమ్మెల్యే సుధీర్‌రెడ్డి హెచ్‌ఎండీఏ నిధులను మంజూరు చేయించారు.

జులైలో శంకుస్థాపన...

బండిరేగుల వద్ద కల్వర్టును నిర్మించేందుకు సుమారు రూ.70 లక్షలు మంజూరు చేయించిన ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గత జులైలో కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వర్షాల కారణంగా కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టడంలో కొంత జాప్యం జరిగింది. దీంతో అక్టోబర్ తర్వాత పనులు మొదలయ్యాయి. వర్షాలు పూర్తయినా పనులు వేగంగా జరగడం లేదు. నాలుగు నెలలు అయినా స్లాబు కూడా వేయలేదు దీంతో పనులు ఎప్పుడు పూర్తవుతాయో అని వాహనదారులు ఎదురుచూస్తున్నారు. మరో 3 నెలల్లో పనులు పూర్తికాకుంటే మళ్లీ వర్షాలు వచ్చి అంతరాయం ఏర్పడే పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



కల్వర్టు నిర్మాణం జరుగుతుండటంతో పక్కనుంచి ప్రత్యామ్నాయ రోడ్డును ఏర్పాటు చేశారు. ఇరుకుగా గుంతల మయంగా ఉండే ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుంది. ఎప్పుడు జారి పడతామో అని భయంగా ఉంది. రాత్రిపూట ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

– వర్కాల సురేష్, తొర్రూర్

నెలరోజుల్లో పూర్తిచేస్తాం

ఎగువ నుంచి వరద నీరు వస్తుండటంతో పనులు చేయడంలో జాప్యం జరిగింది. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. స్లాబు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం, ప్రహరీ పనులను వేగవంతం చేస్తున్నాం. ప్రయాణికులు ఆందోళన పడొద్దు. మరో నెల రోజుల్లో పనులు పూర్తిచేసి కల్వర్టును అందుబాటులోకి తెస్తాం.

– నరేంద్ర తేజ, ఏఈ, జీహెచ్‌ఎంసీ, హయత్‌నగర్ సర్కిల్

అంధత్వ నిర్మూలనకే కంటివెలుగు



ఆమనగల్లు: వైద్య సిబ్బందిని సత్కరించిన నేతలు

ఆమనగల్లు: అంధత్వ రహిత సమాజ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు దోనాదుల కుమార్ అన్నారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామంలో గత వారం రోజులుగా కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమం ముగింపు సందర్భంగా పోలెపల్లి ఎంపీటీసీ సభ్యులు దోనాదుల కుమార్ ఆధ్వర్యంలో కంటి వెలుగు సిబ్బందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫారూక్ హుస్సేన్, డాక్టర్లు పరిక్షిత్ నరేందర్, మంజులాదేవి, సిబ్బంది తిరుపతిరెడ్డి, నవీన్, గ్రామ కార్యదర్శి దేవేందర్, మాజీ సర్పంచ్ లాలయ్య, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు జంతుక వెంకటయ్య, నాయకులు దారెడ్డి నర్సిరెడ్డి, నవీన్, రామకృష్ణ, పవన్, రాజు, శివ, మహేశ్, వెంకటేశ్, రవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

తలకొండపల్లి: కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలనిసర్పంచ్ రమేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పడకల్‌లో ఆయన ఎంపీటీసీ సభ్యులు జోగు రమేష్‌తో కలిసి కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. పలువురికి దగ్గరుండి కంటి పరీక్షలు చేయించారు. చౌదర్‌పల్లి, పడకల్‌లో నిర్వహించిన శిబిరాల్లో 239 మందికి పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్లు సైదమ్మ, కల్పన, స్నేహ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఏలు మల్లయ్య, రామచంద్రయ్య, రవికుమార్, శివకుమార్, నాగమల్లీశ్వరి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం..

కడ్తాల్: కంటి వెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డితో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. పరీక్షల కోసం వచ్చే ప్రజానీకానికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సిద్దిగిరి దాస్, ఆసిఫ్‌అలీ, నరేందర్‌రెడ్డి ఉన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

కడ్తాల్: కడ్తాల్ మండలం చరికొండ గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా గురువారం ఆలయంలో ధ్వజారోహణ, భేరిపూజ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో చక్రవర్తి శ్రీనివాసచార్య, వేణుచార్య, రామయ్యచార్య, కిరణ్‌చార్య తదితరులు ఉన్నారు.

హనుమాన్ ఆలయంలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని చెన్నారం హనుమాన్ దేవాలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను తిలకించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ స్వప్న, ఉప సర్పంచ్ వరలక్ష్మి, ఆంజనేయులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్‌నాయక్, చందూ, మల్యానాయక్, రాజు, అశోక్ పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు



కార్మికులతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న స్కైలాబ్ బాబు

మంచాల: కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర గురువారం మంచాల మండలంలోని చిత్తాపూర్, ఆరుట్ల, జాపాల, రంగాపూర్ గ్రామాల మీదుగా కొనసాగింది. ఈ యాత్రలో పాల్గొన్న స్కైలాబ్ బాబు ఆరుట్లలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్మికుల కృషి పల్లె ప్రగతి పథకం విజయవంతమైందని అయినా వారికి ప్రభుత్వం వారికి కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. తక్షణమే వారికి పనికి తగిన వేతనం ఇవ్వడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాదయాత్ర బృందం సభ్యులు చాగంటి వెంకటయ్య, గణపతిరెడ్డి, పాండు, వినోద్ కుమార్, తునికి మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్, నాయకులు సోమన్న సామేల్, ప్రకాశ్ శరత్, బుచ్చయ్య, జగదీష్, స్వప్న, కృష్ణ, జగన్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

పోచారంలో కాలుష్య సమస్య పరిష్కరిస్తా

బీఆర్ఎస్ యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి



పోచారంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పోచారం గ్రామ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న రైస్‌మిల్లుల అనుమతులను రెన్యూవల్ చేయకుండా ప్రభుత్వ అధికారులతో మాట్లాడుతానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రగతినివేదన పాదయాత్ర బుధవారం రాత్రి మెటిల్లాలో, గురువారం పోచారం గ్రామంలో సాగింది. ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆయా గ్రామాల్లో గడపగడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పోచారంలో కాలుష్య సమస్య ఉందన్నారు. రైస్‌మిల్లులు, ప్లైవుడ్ కంపెనీలను గ్రామానికి దూరంగా పెట్టేలా చూస్తానని తెలిపారు. వాటి అనుమతులు రెన్యూవల్ కాకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు పోచారం గ్రామంలో రూ.90.52 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. 15 రోజుల్లో ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను పునరుద్ధరిస్తామని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలకోసం రూ.5 లక్షలు మంజూరు చేశానని తెలిపారు. గౌడ సంఘం భవనం నిర్మాణం కోసం రూ.5 లక్షలు అందజేశానన్నారు. ఇబ్రహీంపట్నం వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి కుమారుడి జ్ఞాపకార్థం క్రికెట్, వాలీబాల్ కిట్లను ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అందజేశారు.

గాయంతోనే పాదయాత్ర..

కొద్ది రోజుల క్రితం రాయపోల్ గ్రామంలో పాదయాత్ర చేస్తుండగా ప్రశాంత్‌కుమార్‌రెడ్డి కాలు బెణికింది. అప్పట్లో కూడా యాత్ర ఆపలేదు. మళ్లీ 420 కిలోమీటర్లు దాటగానే పోచారంలో మళ్లీ కాలుకు గాయం అయ్యింది. వైద్యులచే చికిత్స చేయించుకొని మళ్లీ పాదయాత్ర కొనసాగించాడు. యాత్ర ఆపమని నాయకులు ఎంతచెప్పినా పట్టించుకోలేదు. యాత్ర కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఎంపీపీ కృపేశ్, వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు రాంరెడ్డి, అశోకవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు రమేష్, మాధవి, ఎంపీటీసీ మంగ రవీందర్, భగీరథ సాగర్, గొరిగే కృష్ణ, చంటీ, శ్రీధర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి వాహనాలు బోల్తా



మక్తమాధారం సమీపంలో వ్యవసాయ పొలంలో బోల్తాపడిన కారు



కడ్తాల్ సమీపంలో బోల్తాపడిన బొలేరో

స్వల్ప గాయాలతో బయటపడిన ప్రయాణికులు

కడ్తాల్: శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో వాహన డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నూకల లోడ్‌తో కడ్తాల్ వైపు వస్తున్న బొలేరో వాహనం ముచ్చర్ల గేట్ సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో డ్రైవర్ పవన్‌కుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కాసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలీసులు వాహనాన్ని రోడ్డుపై నుంచి తొలగించి రాకపోకలను సరిచేశారు. పూర్తివివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మక్తమాధారం గ్రామ శివారులో..

కడ్తాల్: కారు బోల్తాపడి ఇద్దరు యువకులు గాయపడిన సంఘటన మండల పరిధిలోని మక్తమాధారం గ్రామ శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... హైదరాబాద్ నగరంలోని ఉప్పల్ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు, రావిచేడ్ గ్రామంలో జరుగుతున్న బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు కారులో వస్తుండగా మార్గమధ్యలో మక్తమాధారం గ్రామ శివారులో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పంట పొలంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు యువకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ఆమనగల్లు: సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరమని ఎమ్మెల్సీ కసిరెడ్డి అన్నారు. మండలంలోని పలువురికి గురువారం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. ఎంపీపీ అనిత, నాయకులు విజయ్, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, విజయ్‌రాథోడ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

వెల్జాల్‌లో..

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన ఎల్లయ్యకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.12,000 సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. గురువారం మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్ ఎల్లయ్యకు సంబంధిత చెక్కు అందజేశారు. రాజు, రాఘవేందర్, రవి, మహేష్‌నేత పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో తెలంగాణ: బీజేపీ



మాట్లాడుతున్న నల్లు ఇంద్రసేనారెడ్డి

హయత్‌నగర్: ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని ఆర్థికంగా పటిష్టం చేస్తే కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి ఆరోపించారు. ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా హయత్‌నగర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఆ పథకాలను పేదలకు నేరుగా అందించకుండా పేర్లను మార్చి తన పథకాలుగా కేసీఆర్ ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఇవ్వడంలో, పెన్షన్లు, రేషన్ కార్డులను ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ... ఎంతో మంది విద్యార్థులు, ఉద్యమకారుల త్యాగఫలితంతో తెలంగాణ సాధ్యమైందని అన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు ఎల్లప్ప, నాయకులు రమేష్, వెంకటేష్, రమేష్, పారంద మహేష్, బొంగు రఘు, అప్పారావు, పార్వతి, సంఘి అశోక్, గోవిందాచారి, రాము తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయండి

కమిషనర్‌కు ఏఐటీయూసీ నేతల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ చౌరస్తాలో లేబర్ అడ్డా వద్ద పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో కూలీపనుల కొరకు అడ్డాకు వచ్చే కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య తెలిపారు. గురువారం మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. లేబర్ అడ్డా వద్ద కూలీపనుల కొరకు వచ్చే మహిళల పరిస్థితి మరీ దారుణంగా ఉందని, వెంటనే స్పందించి అక్కడ మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మున్సిపాలిటీ సహాయ కార్యదర్శి పి.శివకుమార్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) సభ్యులు సుందరమ్మ, దీప్లా, లేబర్ అడ్డా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా రాజరాజేశ్వరాలయం



మంత్రి సబితారెడ్డికి ప్రసాదం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

- ఆలయంలో మౌలిక వసతులు కల్పిస్తాం
- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్, డైరెక్టర్లు, అధికారి, పూజారులు మంత్రిని ఆమె నివాసంలో కలిసి స్వామివారి ప్రసాదం అందజేసి, కండువాను బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి సబిత మాట్లాడారు. కాకతీయులు శివాలయం నిర్మించడం గర్వించదగ్గ విషయమని, గంగలో శివాలయం, చుట్టూ బ్రహ్మ కమలం వలే పదహారు శివాలయాలు కొలువుదీరడం చాలా అరుదని ఆమె చెప్పారు.

వసతులు కల్పిస్తాం..

రాజరాజేశ్వర ఆలయంలో మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి సబితారెడ్డి చెప్పారు.ఆలయం, గడికోటను అభివృద్ధి చేసి, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిధులతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామనివెల్లడించారు. బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించిన ఆలయ చైర్మన్, డైరెక్టర్లను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుధీర్‌గౌడ్, ఈఓ మురళీకృష్ణ, డైరెక్టర్లు బాలరాజ్, మహేందర్, ప్రధాన పూజారి వీరేశం, ఆలయ మాజీ చైర్మన్ నవీన్, బీఆర్ఎస్ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షుడు కృష్ణ, గ్రామ కోఆప్షన్ సభ్యుడు రమేష్, నాయకులు సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా సంత్ గాడ్గె బాబా జయంతి



సంత్ గాడ్గె బాబా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో బహుజన సేన ఆధ్వర్యంలో గురువారం సామాజిక, ఆధ్యాత్మిక బహుజన ఉద్యమ యోధుడు సంత్ గాడ్గె బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్ గాడ్గె బాబా చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజన సేన జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ వర్కాల శేఖర్, హ్యూమన్ రైట్స్‌క్లబ్ జిల్లా ఆర్గనైజర్ కొమ్ము తిరుపతి, సింగంపల్లి సర్పంచ్ ప్రేమలత, నాయకులు నర్సింహ, ఉప్పల రాములు, డాక్టర్ నర్సింహులు, భిక్షపతి, అంజయ్య, ప్రభాకర్, బాలు, యాదగిరి, లాలు, ఈదమయ్య తదితరులు పాల్గొన్నారు.

దళిత ఎమ్మెల్యేలపై చిన్నచూపు తగదు



అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: దళిత ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలపై ప్రభుత్వం చిన్నచూపు చూసిందని బీఎస్పీ ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు గ్యార మల్లేష్ మండిపడ్డారు. దీనిని నిరసిస్తూ గురువారం ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా సాయన్న ఐదుసార్లు గెలిస్తే ప్రభుత్వ లాంచనలతో అంత్యక్రియలు జరపకపోవడం సిగ్గుచేటన్నారు. అనగారిన వర్గాలకు ఒక న్యాయం, ఉన్నత వర్గాలకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. ఆంధ్ర పెత్తందారులు, ఉన్నత వర్గాల వారైన సినిమా నటులు కృష్ణ, కృష్ణంరాజు, దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేసి సాయన్నకు చేయకపోవడం విడ్డూరమన్నారు. దళిత బహుజనులు ఏకంకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈసీ సభ్యులు గణేశ్, జిల్లా కార్యదర్శి రాములు, శాంత, దాసు, రఘుపతి, కృష్ణప్రసాద్, మహేందర్, మల్లయ్య, నాగేష్, మహేందర్, కుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.